

ప్రకృతి అందాల పార్క్

మాక్లూర్ మండలం చిన్నాపూర్ శివారులో గల అర్బన్ పార్క్ ప్రకృతి అందాలకు నెలవుగా మారింది.

- 10లో ▸



సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక

ఆర్మూర్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం రాష్ట్ర సాఫ్ట్‌బాల్ జట్లను ఎంపిక చేశారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
40.4 /29.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం నుంచే ఉక్కపోతగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి. సాయంత్రానికి వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

క్యాంపస్ కళాశాలల తనిఖీ



తెయూ(డిచ్‌పల్లి) : విద్యార్థి నాయకుల ఫిర్యాదు మేరకు తెలంగాణ యూనివర్సిటీలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, కామర్స్ అండ్ ఎంబీఏ కళాశాలలను శుక్రవారం ఇన్‌చార్జి రిజిస్ట్రార్ కనకయ్యతో కలిసి వీసీ డి రవీందర్ తనిఖీ చేశారు. ఆయా కళాశాలల్లోని అన్ని విభాగాలను, తరగతి గదులను పరిశీలించారు. హాజరు రిజిస్టర్‌లు తనిఖీ చేశారు. అనుమతి లేకుండా గైర్హాజరైన అధ్యాపకులపై వీసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది సెలవుపై వెళ్లినప్పుడు తన అనుమతి తీసుకోవాలని వీసీ సూచించారు. వైస్‌ప్రిన్సిపాల్ సత్యనారాయణ, పీఆర్‌వో ఎండీ జమీల్ అహ్మద్, విద్యార్థి నాయకులు ఉన్నారు.

ముగిసిన సర్వే

నిజామాబాద్‌నాగారం : నిజామాబాద్ నగరంలో 2018 ఎన్నికల్లో పోలైన ఓట్ల శాతంపై మూడు రోజులుగా చేపట్టిన సర్వే శుక్రవారం ముగిసింది. కేంద్ర ఎన్నికల బృందం అధికారి వేణుమాధవ్ ఆధ్వర్యంలో 8 మంది అధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో సర్వే చేశారు. పూర్తి నివేదికను కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించనున్నారు.

యువతి కిడ్నాప్‌లో ఇద్దరికి రిమాండ్

ఖలీల్‌వాడి: ఓ యువతిని ఇద్దరు యువకులు కిడ్నాప్ చేసి, వేధింపులకు పాల్పడిన ఘటన నిజామాబాద్ నగరంలో చోటు చేసుకుంది. వివరాలు.. నగరంలోని ఆరో టౌన్ పరిధికి చెందిన యువతి ఈనెల 24న సాయంత్రం తెలిసిన యువకుడితో బైక్‌పై ఖిల్లా రోడ్డు గుండా వెళ్తుంది. ఆ ప్రాంతంలోని కొందరు యువకులు బైకును వెంబడించి యువకుడిని బెదిరించడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. అనంతరం ఆ యువతిని ఇద్దరు యువకులు బైక్‌పై బలవంతంగా ఎక్కించుకొని వివిధ ప్రాంతాలకు తీసుకువెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించారు. తర్వాత బోధన్ రోడ్డులో యువతిని వదిలేసి వెళ్లారు. బాధితురాలు గురువారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీసీ పుటేజీలను పరిశీలించిన పోలీసులు హైమద్ పుర కాలనీకి చెందిన ఇంతియాజ్, కంఠేశ్వర్ చెందిన మతిన్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో విజయబాబు తెలిపారు.

తీరు మార్చుకోని వీసీ

- అక్రమార్కుడిగా ముద్రపడిన కనకయ్యను రిజిస్ట్రార్ కుర్చీలో కూర్చోబెట్టిన వైనం
- పాలకమండలి తీర్మానాలను బేఖాతరు చేస్తున్న ప్రొ.రవీందర్ గుప్తా
- చర్యలు తీసుకోవడంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న ప్రభుత్వం
- తీర్మానాల అమలుకు ముందుకు రాని ఈసీ నియమిత రిజిస్ట్రార్ యాదగిరి
- వెరసి తెలంగాణ యూనివర్సిటీ ప్రతిష్ట బజారు పాలవుతున్న దుస్థితి
- వర్సిటీ వర్గాల్లో తీవ్ర అసహనం



ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా కనకయ్య నియామకంపై వీసీ రవీందర్ గుప్తాతో విద్యార్థి నాయకుల వాగ్వాదం



కనకయ్య

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : తెలంగాణ యూనివర్సిటీలో పరిస్థితులు రోజురోజుకూ దిగజారిపోతున్నాయి. రెండేళ్లుగా చోటుచేసుకుంటున్న అక్రమాలు, అవకతవకల నేపథ్యంలో సరిదిద్దాల్సిన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం మీనమేషాలు లెక్కిస్తోంది. దీంతో వర్సిటీలో పాలక మండలి(ఈసీ) తీర్మానాలకు విలువ లేకుండా పోతోంది. వీసీ రవీందర్‌గుప్తా ఇష్టారీతిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. గురువారం సచివాలయంలో జరిగిన ఈసీ సమావేశంలో యాదగిరిని రిజిస్ట్రార్‌గా కొనసాగిస్తున్నట్లు తీర్మానం చేయగా, తాజాగా శుక్రవారం మాత్రం వీసీ రవీందర్‌గుప్తా కనకయ్యను రిజిస్ట్రార్ కుర్చీలో కూర్చోబెట్టి ఆర్డర్ ఇచ్చారు. ఈ నెల 15న రిజిస్ట్రార్ గదికి వీసీ తాళం వేయించి కొన్ని గంటల తరువాత తెరిపించారు. దీంతో అప్పటి నుంచి యాదగిరి రిజిస్ట్రార్ చాంబర్‌కు రావడం లేదు. అలాగే పాలకమండలి ఏకగ్రీవ తీర్మానం చేసి రిజిస్ట్రార్ బాధ్యతలు అప్పగించినప్పటికీ యాదగిరి ఇప్పటి వరకు ఇతర ఈసీ తీర్మానాల అమలు విషయంలో ఒక్క అంగుళం కూడా ముందుకు కదలలేదు. దీంతో వీసీ చేస్తున్న వ్యవహారాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది.

కనకయ్య అక్రమాలపై ఈసీ తీర్మానాలు..

- నిబంధనలకు విరుద్ధంగా నోటిఫికేషన్ రాకున్నప్పటికీ వచ్చినట్లుగా చూపించుకుని సీనియర్ ప్రొఫెసర్ అయినట్లుగా కనకయ్య చెప్పుకుంటున్నాడు. అడ్డదారిలో వచ్చిన కనకయ్య సదరు ఫైల్‌ను మాయం చేశాడు. ఈ వ్యవహారంపై ఎఫ్ఐఆర్ ఫైల్ చేయాలని 2021 నవంబర్ 26న ఈసీ చెప్పినప్పటికీ ఇప్పటివరకు చేయలేదు.
- నలుగురు ప్రొఫెసర్ల సర్వీసు పుస్తకాలు ఇంటికి తీసుకెళ్లి వాటిని జిరాక్స్ తీసి బయట పంచిన కనకయ్యపై ఆర్టికల్ ఆఫ్ ఛార్జెస్ (నేరారోపణలు) కింద కేసు నమోదు చేయాలని ఈసీ తీర్మానం చేసినప్పటికీ రిజిస్ట్రార్ యాదగిరి ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు.
- పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకల నేపథ్యంలో ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ డీన్ కనకయ్యపై విచారణకు ఈసీ తీర్మానం చేసింది.
- అక్రమ నియామకాల విషయంలో వీసీతో కలిసి కనకయ్య పాలుపంచుకున్నట్లు నిర్ధారించిన ఈసీ 2021 అక్టోబర్ 30న ఇన్‌చార్జి రిజిస్ట్రార్ పదవి నుంచి తొలగించింది.
- ప్రొఫెసర్ విద్యావర్ధినిని సస్పెండ్ చేయాలని గత ఏప్రిల్ 26న జరిగిన 56వ ఈసీ సమావేశంలో తీర్మానించారు. అలాగే వర్సిటీలో చోటుచేసుకున్న అక్రమాలు, అవకతవకలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీకి, ఏసీబీకి, నిజామాబాద్ పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేసి విచారణ చేయించాలని పాలకమండలి తీర్మానం చేసింది. మే 5న నిర్వహించిన 57వ పాలకమండలి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. అయినప్పటికీ రిజిస్ట్రార్ యాదగిరి ఈ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయకపోవడం గమనార్హం. దీంతో వైస్ చాన్స్‌లర్ రవీందర్‌గుప్తా మరింత రెచ్చిపోతూ ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నట్లు వర్సిటీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఇంతకు రిజిస్ట్రార్ ఎవరూ..?

వీసీని నిలదీసిన విద్యార్థులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీకి ఇద్దరు రిజిస్ట్రార్‌లా లేక ఒకరా.. అసలు రిజిస్ట్రార్ ఎవరూ అంటూ విద్యార్థి సంఘాల నాయకులు శుక్రవారం వీసీ ప్రొఫెసర్ డి రవీందర్‌గుప్తాను నిలదీశారు. వీసీ రవీందర్ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ కనకయ్యను నియమించారని తెలుసుకున్న విద్యార్థి నాయకులు వీసీ చాంబర్‌కు వచ్చారు. ఇప్పటికే పాలకమండలి రిజిస్ట్రార్‌గా నియమించిన ప్రొఫెసర్ యాదగిరి ఉండగా ఇప్పుడు ప్రొఫెసర్ కనకయ్యను ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. యాదగిరికి ఆర్డర్స్ లేవని ఆయన రిజిస్ట్రార్‌గా విధులకు రాకపోవడంతోనే తాను కనకయ్యను నియమించినట్లు వీసీ స్పష్టం చేశారు. ఈసందర్భంగా విద్యార్థులకు వీసీ మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. అనంతరం విద్యార్థి నాయకులు క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, తనది కేబినెట్ హోదా అని, ఆఫ్టాల్ ఈసీ మెంబర్లు మీటింగ్‌కు పిలిస్తే నేనెందుకు వెళ్లాలని విద్యార్థులతో అంటున్నారని ఆరోపించారు. ఈసీ రిజిస్ట్రార్‌గా ఒకరిని నియమిస్తే వాటిని బేఖాతరు చేస్తూ వీసీ ఇంకొకరిని రిజిస్ట్రార్‌గా నియమిస్తున్నారని విమర్శించారు. వర్సిటీకి ఇద్దరు రిజిస్ట్రార్లు ఎలా ఉంటారని ప్రశ్నించారు. వర్సిటీకి రిజిస్ట్రార్ లేక అధ్యాపకులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసీ ఆమోదం లేకుండా పనులు చేస్తూ రూ.కోట్లు దుర్వినియోగం చేసిన వీసీపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రిజిస్ట్రార్ లేకపోవడంతో విద్యార్థులకు మెమోలు ఇవ్వలేని దుస్థితిలో వర్సిటీ ఉందన్నారు. ఇదేమని విద్యార్థి సంఘాల నాయకులు ప్రశ్నిస్తే నా ఇష్టం వచ్చిన వారిని రిజిస్ట్రార్‌గా నియమిస్తానని, మీకు అవన్నీ అవసరం లేదని, ఎక్కువ మాట్లాడితే పోలీసులను పిలిపించి అరెస్టు చేయిస్తానని బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న వీసీపై స్థానిక ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్, ఎమ్మెల్సీ కవిత, మంత్రి ప్రశాంత్ రెడ్డి స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, తెలంగాణ యూనివర్సిటీని కాపాడాలని కోరారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వీసీ చాంబర్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు సంతోష్, లక్ష్మీనారాయణ, సాయికృష్ణ, సైమన్ పాల్ పాల్గొన్నారు.

పాలిసెట్ ఫలితాల్లో సత్తా



సంకీర్త్‌కు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు



కుటుంబ సభ్యులతో సాయికృష్ణ

- ఆరో ర్యాంకు సాధించిన సంకీర్త్

నిజామాబాద్‌అర్బన్/పెర్కిట్ : జిల్లా విద్యార్థులు శుక్రవారం విడుదలైన పాలిసెట్ ఫలితాల్లో సత్తా చాటారు. నగరంలోని గౌతమ్‌నగర్‌కు చెందిన మానేటి సంకీర్త్ రాష్ట్ర స్థాయిలో ఎంపీసీ విభాగంలో 6వ ర్యాంకు, ఎంబైపీసీ విభాగంలో 12వ ర్యాంకు సాధించాడు. ఎంపీసీలో120 మార్కులకు 118, ఎంబైపీసీలో 150 మార్కులకు 114.5 మార్కులు సాధించాడు. సంకీర్త్ నగరంలోని విశ్వోదయ పాఠశాలలో పదో తరగతి చదివి, 9.5 గ్రేడ్ సాధించాడు. అనంతరం పాలిటెక్నిక్ పరీక్ష రాశాడు. తండ్రి వెంకటరమణ, తల్లి శిరీష నగరంలోని కాకతీయ జూనియర్ కళాశాలలో లెక్చరర్లుగా పనిచేస్తున్నారు.

సాయికృష్ణకు 8వ ర్యాంక్

పెర్కిట్ : ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి యోగేశ్వర కాలనీకి చెందిన గటడి సాయికృష్ణ పాలిసెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 8వ ర్యాంకు సాధించాడు. సాయికృష్ణ ఎంపీసీ విభాగంలో 120 మార్కులకు 117 మార్కులు సాధించి 8వ ర్యాంకును కైవసం చేసుకున్నాడు. ఎంబైపీసీ విభాగంలో 112 మార్కులు సాధించి 27వ ర్యాంకు సాధించాడు. ప్రభుత్వ ఉపాధ్యాయులు గటడి అశోక్, విజయ దంపతుల పెద్ద కుమారుడు సాయికృష్ణ స్థానిక బ్రిలియంట్ పాఠశాలలో ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు చదివాడు. పదో తరగతి ఫలితాల్లో అన్ని సబ్జెక్టులలో పదికి పది జీపీఏ సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచాడు. ఐఐటీలో ఉత్తమ ర్యాంకు సాధించి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలనే కుమారుని ఆకాంక్షలకు అనుగుణంగా తల్లితండ్రులు సాయికృష్ణను మాదాపూర్ నారాయణ కళాశాలలో చేర్పించారు.

అంజన్ కుమార్‌కు 55వ ర్యాంక్



అంజన్‌కుమార్

నగరంలోని సాయిప్రియనగర్‌కు చెందిన చింతకింది అంజన్‌కుమార్ రాష్ట్రస్థాయి 55వ ర్యాంకు సాధించాడు. ఎంపీసీలో 120 మార్కులకు 114 వచ్చాయి. ఎంబైపీసీలో150 మార్కులకు 112.5 మార్కులతో 21వ ర్యాంకు పొందాడు. అంజన్‌కుమార్ తండ్రి శ్రీనివాస్ నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నాడు. తల్లి వసంత గృహిణి. అంజన్‌కుమార్ హైదరాబాదులోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదివి 9.5 గ్రేడ్ పొందాడు.

రుణాలిస్తామంటూ మోసం

- ఓ సంస్థ పేరుతో కార్యకలాపాలు
- డిపాజిట్లు కట్టించుకుని కాలయాపన
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు



దేవునిపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చిన బాధితులు

కామారెడ్డి క్రైం : అధిక వడ్డీతో పాటు రుణాలు ఇస్తామంటూ వందల మందితో డిపాజిట్లు చేయించుకుని తప్పించుకు తిరుగుతున్న ఓ సంస్థపై బాధితులు ఫిర్యాదు చేశారు. కామారెడ్డి మండలం చిన్న మల్లారెడ్డికి చెందిన ఓ వ్యక్తి ఏడాది క్రితం కామారెడ్డి కొత్త బస్టాండ్ ప్రాంతంలో జీడీఎఫ్‌సీ నిధి లిమిటెడ్ పేరుతో ఓ సంస్థను ప్రారంభించారు. తమ సంస్థలో డిపాజిట్లపై అధిక వడ్డీ చెల్లిస్తామని, తక్కువ వడ్డీకే రూ. 3 లక్షల చొప్పున గృహ రుణాలు అందిస్తామని నమ్మించారు. గ్రామాల వారీగా ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని దాదాపు 5 వందల మందికి పైగా కస్టమర్ల వద్ద నుంచి రూ. 20 లక్షల వరకు డిపాజిట్లు సేకరించినట్లు తెలుస్తోంది. డిపాజిట్లు కట్టి ఏడెమిదిని నెలలు గడుస్తున్నా రుణాలు ఇవ్వకపోవడం, కార్యాలయాన్ని మూసి ఉంచడంతో డిపాజిట్‌దారులు మోసపోయామని గుర్తించారు. గాంధారి మండలం మాతుసంగెం, పేట్‌సంగెం గ్రామాలకు చెందిన 20 మంది బాధితులు చిన్నమల్లారెడ్డిలోని సదరు వ్యక్తి ఇంటికి వెళ్లి గురువారం నిలదీసినట్లు తెలిసింది. వారే కాకుండా తాడ్వాయి, కృష్ణాజీవాడి, లింగాపూర్ తదితర గ్రామాలకు చెందిన బాధితులు సైతం తాము సదరు కంపెనీలో డిపాజిట్‌లు పెట్టినట్లు చెబుతున్నారు. కంపెనీలో ఒక్కొక్కరు రూ.7 వేల నుంచి రూ.15 వేల వరకు డిపాజిట్లు చెల్లించామన్నారు. బాధితులు దేవునిపల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా సదరు కంపెనీ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుందనీ, అక్కడే ఫిర్యాదు చేయాలనీ చెప్పి పంపారు. కాగా సమయం ఇస్తే డబ్బులు తిరిగి ఇస్తామంటూ బాధితులతో కంపెనీ యాజమాన్యం చర్చలు సాగిస్తున్నట్లు తెలిసింది.

3 నుంచి గోదావరి హారతి యాత్ర



మాట్లాడుతున్న ఉత్సవ కమిటీ అధ్యక్షుడు తిరుపతి

నిజామాబాద్ సిటీ : గోదావరి హారతి కార్యక్రమం జూన్ 3 నుంచి నిర్వహిస్తున్నట్లు గోదావరి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రచ్చ తిరుపతి తెలిపారు. శుక్రవారం నగరంలోని హోటల్ నిఖిల్ సాయిలో గోదావరి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గోదావరి హారతి యాత్ర ఇందూరు జిల్లా సమావేశం జరిగింది. రచ్చ తిరుపతి మాట్లాడుతూ జూన్ 3 నుంచి 8 వరకు 'తల్లి గోదావరి పిలుస్తుంది రా కదలి రా' అనే కార్యక్రమాన్ని నది పరీవాహక ప్రాంతాలు కందకుర్తి, బాసర, గుమ్మిర్యాల, ధర్మపురి, కాళేశ్వరం, రామన్న గూడెం, భద్రాచలంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. తొలియాత్ర జూన్ 3 శనివారం త్రివేణి సంగమ క్షేత్రమైన కందకుర్తిలో శ్రీరామచంద్రుడి అర్చకులు ప్రారంభించనున్నారని తెలిపారు. యాత్రలో భాగంగా ప్రతి క్షేత్రంలో జనసభ సదస్సులు, పెద్దల మార్గదర్శనం గోదావరి తీరాన ప్రతి సాయంత్రం సామూహిక హారతి ఉంటుందని పేర్కొన్నారు. ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి వీరగోపాల్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని వ్యవస్థాపక చైర్మన్ మురళీధర్ ధర్మపురిలో మొదటిసారి ప్రారంభించారన్నారు. కన్యక పరమేశ్వరి ట్రస్టు చైర్మన్ నాగభూషణంగుప్తా, తెలంగాణ యూనివర్సిటీ ప్రొఫెసర్ త్రివేణి, దేవాగౌడ్, కొండ ఆశన్న, రామారావు, రాజారెడ్డి, రాఘవేందర్, నాగ భూషణం, రాజ్‌కుమార్ సుబేదార్, లక్ష్మారెడ్డి, పంచరెడ్డి రాము, ఇందల్‌వాయి కిషన్ పాల్గొన్నారు.

బట్టాపూర్ క్వారీలో రూ.400 కోట్ల కుంభకోణం



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు మల్లికార్జున్‌రెడ్డి, పక్కన పల్లె గంగారెడ్డి, మోహన్‌రెడ్డి

- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, వారి బంధువుల హస్తం
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి ఆరోపణ

సుభాష్‌నగర్ : ఏర్గట్ల మండలంలోని బట్టాపూర్ క్వారీలో రూ.400 కోట్ల కుంభకోణం జరిగిందని, అందులో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఆయన బంధువుల హస్తముందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్వారీలో పెద్ద ఎత్తున అవకతవకలు చోటు చేసుకున్నాయని, వెంటనే ఈటీఎస్ సర్వే చేయించి నిజాలు నిగ్గు తేల్చాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు ఫిర్యాదు చేశానన్నారు. క్వారీకి 9,280 క్యూబిక్ మీటర్ల అనుమతి మాత్రమే ఉందని, పర్యావరణ అనుమతి కూడా లేదన్నారు. ఈ విషయమై గనుల శాఖ డైరెక్టర్ జనరల్ సోమేశ్‌కుమార్‌కు లేఖ రాశామని గుర్తుచేశారు. అనుమతికి మించి 1.54 లక్షల క్యూబిక్ మీటర్ల వరకు అక్రమంగా తవ్వకం చేపట్టారని ఆరోపించారు. 8 ఏళ్లుగా క్వారీని నడుపుతున్నారని, ఆ మేరకు ఇప్పటివరకు సుమారు 20 లక్షల క్యూబిక్ మీటర్ల వరకు తవ్వారన్నారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఒక్క పనికే మూడుచోట్ల శిలాఫలకాలు, శంకుస్థాపనలు చేస్తూ ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్వారీలో మంత్రికి ప్రమేయం ఉందో.. లేదో.. ప్రజల ముందుకు వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి మాట్లాడుతూ కేరళ స్టోరీ, కాశ్మీర్ ఫైల్స్ మాదిరిగానే ఇందూరు ఫైల్స్ చిత్రాన్ని తీస్తామని పేర్కొన్నారు. నాయకులు వడ్డీ మోహన్‌రెడ్డి, గద్దె భూమన్న, స్రవంతిరెడ్డి, న్యాలం రాజు, రాజశేఖర్‌రెడ్డి, మల్కన్నగారి మోహన్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో ఒత్తిడి దూరం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత

నిజామాబాద్ సిటీ : మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం ఆరోగ్యకరంగా ఉంటుందని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. శుక్రవారం నగరంలోని గంగాస్థాన్ ఫేజ్ 2 ఐఎంఏ హాల్‌లో శ్రీ రామచంద్ర మిషన్ కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, ఐఎంఏల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే యోగా మహోత్సవం కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. యోగా, ధ్యానం కార్యక్రమంలో పాల్గొనటం ఇదే తొలిసారని, ధ్యానం చేయటంతో మనస్సుకు ఎంతో ప్రశాంతత లభించినట్లు చెప్పారు. తమ విధుల్లో భాగంగా ఒకరికి జైలు శిక్ష వేయాలంటే మొదట ఆ వ్యక్తి కుటుంబం గురించి ఆలోచించాల్సి వస్తుందని, ఆ సమయంలో ఎంతో ఒత్తిడికి గురవుతామన్నారు. హార్ట్ ఫుల్‌నెస్ జోనల్ ఇన్‌చార్జి కృష్ణారావు మాట్లాడుతూ కొంతమంది ఆసనాలు మాత్రమే వేస్తారు, మరికొంతమంది ధ్యానం మాత్రమే చేస్తారని, ఈ రెండింటిని కలపాల్సిన అవసరం ఉందన్నారు. అంతకుముందు యోగా శిక్షకులు కిషన్, ప్రభాకర్, ఆంజనేయులు యోగాసనాలు వేసి చూపించారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ నీలి రామచందర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జలగం తిరుపతిరావు పాల్గొన్నారు.

నెరవేరనున్న సొంతింటి కల!

- సొంత స్థలంలో ఇంటి నిర్మాణానికి రూ.మూడు లక్షల సాయం
- వచ్చే నెల నుంచి పథకం అమల్లోకి వచ్చే అవకాశం
- నియోజకవర్గానికి మూడు వేల మంది లబ్ధిదారుల ఎంపిక



మోర్తాడ్ : సొంతంగా స్థలం ఉండి ఆర్థికంగా వెనుకబడిన వారు ఇల్లు నిర్మించుకోవడానికి గృహలక్ష్మి పథకం కింద ప్రభుత్వం ఆర్థిక సాయం చేయనుంది. సొంత జాగాలో ఇళ్ల నిర్మాణం కోసం రూ.మూడు లక్షల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకాన్ని వచ్చే నెలలోనే అమలు చేసే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత లోపించకుండా ప్రభుత్వం కలెక్టర్లకే అధికారం కల్పించడం విశేషం. గతంలో ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం ఎమ్మెల్యేల ద్వారా ఎంపిక చేసిన వారికే వర్తింపచేసేవారు. ఒక్కో నియోజకవర్గానికి మూడు వేల చొప్పున ఇళ్ల నిర్మాణం కోసం ఆర్థిక సాయం అందించనున్నారు. జిల్లాలో బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్, అర్బన్, బోధన్ నియోజకవర్గాలతో పాటు బాన్సువాడ నియోజకవర్గంలోని మండలాలు ఉన్నాయి. జిల్లాకు 16,500 ఇళ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు కానున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత హౌజింగ్ బోర్డును పూర్తిగా ఎత్తివేయడం, డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం ఇతర ఇంజినీరింగ్ శాఖలకు అప్పగించడంతో సొంతంగా జాగా ఉన్నవారు ఇంటిని నిర్మించుకోవడానికి సాయం అందుకోలేకపోయారు. తెలంగాణ ఆవిర్భవించి తొమ్మిదేళ్లు గడచిపోనున్న సమయంలో గృహలక్ష్మి పథకం అమలులోకి రావడాన్ని పలువురు స్వాగతిస్తున్నారు. ఇది ఇలా ఉండగా ఇళ్ల నిర్మాణం కోసం రూ.మూడు లక్షల సాయాన్ని మూడు విడుతల్లో ఇవ్వాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. లబ్ధిదారుల ఎంపికకు అవసరమైన విధివిధానాలను త్వరలోనే ప్రకటించనున్నారు.

పేదలకు అండగా కొత్త పథకం



గృహలక్ష్మి పథకం ద్వారా సొంతింటిని నిర్మించుకునే వారికి రూ.మూడు లక్షల సాయం అందించడం మంచి నిర్ణయం. పేదలకు ఈ పథకం అండగా నిలవబోతుంది. ఇళ్ల నిర్మాణం కోసం పేద, మధ్య తరగతి వారికి ఆర్థిక భారం తప్పనుంది.

– భోగ ధరణి, సర్పంచ్, మోర్తాడ్

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



గృహలక్ష్మి పథకం అమలు చేయడంతో పేదలు ఇల్లు కట్టుకోడానికి ఉపయోగపడుతుంది. పేదల కోసం కొత్త పథకం అమలులోకి తీసుకు వచ్చిన ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల పక్షపాతి అని మరోసారి నిరూపించింది.

– కొలిప్యాక ఉపేంద్ర, ఎంపీపీ, ఏర్గట్ల

క్లుప్తంగా

పనికి తగిన వేతనం ఇవ్వాలి



మోర్తాడ్: ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పనికి తగిన వేతనం లభించడం లేదని, వారికి తగిన వేతనం ఇవ్వాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా మండలంలోని తిమ్మాపూర్‌లో శుక్రవారం ఆయన ఉపాధి కూలీలను కలుసుకుని మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో కూలీలకు రవాణా, పని చోట టెంటు, నీటి సౌకర్యం కల్పిస్తే ఈ ప్రభుత్వాలు అవేమి పట్టించుకోవడం లేదన్నారు. కూలీల పొట్టగొట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడుతున్నాయన్నారు. కూలీలకు పూర్వవైభవం రావాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావాలన్నారు. తాము అధికారంలోకి రాగానే కూలీల శ్రమకు తగిన వేతనం అందేలా చూస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు రొక్కం మురళి, బద్దం రాజశేఖర్, ఆనంద్, గురిజాల నర్సయ్య, సుధీర్, నర్సయ్య, దేవేంధర్, అజయ్, రవి, అనిల్, అశోక్, మహిపాల్, విజయ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



భిక్కనూరు: ఎన్నో ఏళ్లుగా విద్యాలయాల్లో కాంట్రాక్టు అధ్యాపకులుగా పనిచేస్తున్నా.. తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయడంలో ప్రభుత్వం వివక్ష చూపుతుందని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని సౌత్ క్యాంపస్ కాంట్రాక్టు అధ్యాపకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం వారు సౌత్ క్యాంపస్‌లోని గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. 12 విశ్వవిద్యాలయాల్లో 1300 మంది కాంట్రాక్టు అధ్యాపకులుగా ఉన్నారని 2015లో వీరందరిని రెగ్యులర్ చేస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చి మరిచిపోయాడని కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణగుప్త ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీని నెరవేర్చేదాక ఉద్యమిస్తామన్నారు. కాంట్రాక్టు అధ్యాపకులు యాలాద్రి, సునీత, నరసయ్య, రమాదేవి, వైశాలి పాల్గొన్నారు.

భూమి విషయంలో ఘర్షణ

సిరికొండ: మండలంలోని తాటిపల్లి గ్రామంలో భూమి విషయంలో శుక్రవారం జరిగిన ఘర్షణలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నర్సింలు తెలిపారు. భూమి విషయంలో తండ్రి, కొడుకులైన బుక్య రాంచందర్, బుక్య తిరుపతిలను అదే గ్రామానికి చెందిన బుక్య రమేష్, బుక్య గంగారాంలు కర్రలతో దాడి చేశారని ఎస్సై తెలిపారు. ఈ దాడిలో రాంచందర్, తిరుపతి తలలు పగిలి తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. దాడిలో గాయపడిన రాంచందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని వివేకానంద కాలనీలోగల ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై శుక్రవారం రాత్రి పట్టణ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని రూ. 13వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, నిందితులను కోర్టులో హాజరుపరుచనున్నట్లు ఎస్‌హెచ్‌ఓ నరేష్ తెలిపారు.

ప్రకృతి అందాల అర్బన్ పార్కు

- పూర్తికావొస్తున్న పనులు
- త్వరలో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం!



అర్బన్ పార్కులోని ప్రవేశ ద్వారం వద్ద ఆకట్టుకుంటున్న వివిధ నిర్మాణ ఆకృతులు

మాక్లూర్: మండలంలోని అడవి మామిడిపల్లి శివారులోగల చిన్నాపూర్ గండి 63వ నంబర్ జాతీయ రహదారి పక్కన రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న అర్బన్ పార్కు పనులు పూర్తికావొస్తున్నాయి. అలాగే త్వరలో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరుపుకోనున్నట్లు సమాచారం. నిజామాబాద్ జిల్లా కేంద్రానికి 5కిలోమీటర్ల దూరంలో ఈ పార్కును 470 ఎకరాల్లో రూ: 5.58 కోట్ల అంచన వ్యయంతో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం అర్బన్ పార్కు పనుల్లో చిన్నచితక పనులు మినహా సుమారు పార్కు నిర్మాణం పూర్తయింది. ఇటీవల సీఎం కార్యాలయ కార్యదర్శి స్మితాసబర్వాల్, ఓఎస్‌డీ ప్రియాంకవర్గీస్‌లు పార్కును సందర్శించారు. ఉత్తర తెలంగాణలోనే మేటి పార్కుగా రూపుదిద్దుకుంటున్న ఈ పార్కుకు మరికొన్ని సరికొత్త హంగులు అవసరమని ఫారెస్టు అధికారులకు సూచనలు ఇచ్చారు.

పార్కులోని ప్రత్యేకతలు ఇవే..

పార్కు ముఖ ద్వారం అడవి జంతువుల చిత్రపటాలతో అందంగా తీర్చిదిద్దారు. లోపలికి ప్రవేశించిన అనంతరం ఏవైపు చూసిన పచ్చని చెట్లు వాటి మధ్య నుంచి వేసిన రహదారులు ఆకట్టుకుంటున్నాయి. అలాగే పార్కులో వ్యాయామం చేయటానికి కొన్ని చోట్ల జిమ్‌లు ఏర్పాటు చేశారు. సేద తీరటానికి ప్రతి 100 మీటర్లకు ఓ డైనింగ్ టేబుల్స్, కుర్చీలు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. పిల్లల కోసం ప్రత్యేకమైన ప్లేజోన్ పనులు కొనసాగుతున్నాయి. పార్కు మధ్యలో నిర్మించిన మూడంతస్తుల వాచ్‌టవర్ ఓ ప్రత్యేక అనుభూతిని కల్గించనుంది. దానిపై నుంచి చూస్తే చుట్టూ ఉన్న అడవి ప్రకృతి అందాలు ఆహ్లాదాన్ని ఇస్తాయి. పార్కులోని మరో 126 ఎకరాల్లో సందర్శకుల కోసం ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేశారు. పార్కులో ఉన్న ఓ చెరువును మరింత మెరుగుపర్చి అందులో బోటింగ్ ఏర్పాటు చేసే ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఈ పార్కు నిర్మాణం వెనుక స్థానిక ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కృషి ఉండగా.. అటవీశాఖ అధికారుల శ్రమఎంతో ఉంది. ఏదిఏమైన ఈ పార్కును ఒక్కసారి చూస్తే మళ్లీమళ్లీ చూడాలనిపించే ప్రకృతి అందాలు ఈ పార్కులో ఉన్నాయనడంలో సందేహం లేదు.



పార్కు మధ్యలో ఏర్పాటు చేసిన వాచ్‌టవర్



పార్కులో సందర్శకులు కూర్చోవటానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక డైనింగ్ టేబుల్స్



స్టూల్స్



విభిన్న ఆకృతిలో ఏర్పాటు చేసిన బల్ల



పార్కులో ఏర్పాటు చేసిన బాత్‌రూం



పిల్లల ప్లే జోన్



పార్కులో పరుచుకున్న పచ్చదనం



అర్బన్ పార్కును పరిశీలిస్తున్న సీఎం కార్యాలయ కార్యదర్శి స్మితా సబర్వాల్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, తదితరులు (ఫైల్)

సాఫ్ట్‌బాల్ రాష్ట్ర జట్ల ఎంపిక



సాఫ్ట్‌బాల్ రాష్ట్ర జట్లకు ఎంపికైన క్రీడాకారులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం మినీ సబ్ జూనియర్ అండర్-11, అండర్-13 బాలబాలికల రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు జట్లను ఎంపిక చేశారు. క్రీడాకారుల ఎంపికను రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శోభన్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే నెల జూన్ 6నుంచి 8వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపూర్‌లోని ఆర్డీటీ స్టేడియంలో జరగనున్న మినీ సబ్ జూనియర్ జాతీయ పోటీలలో పాల్గొంటారని శోభన్‌బాబు అన్నారు. ఈ పోటీల్లో రాష్ట్ర జట్లను ప్రథమ స్థానంలో వచ్చేవిధంగా కృషిచేయాలని అన్నారు. ప్రస్తుతం ఎంపికైన ప్రబబుల్స్ జట్టు క్రీడాకారులకు శిక్షణ శిబిరం నిర్వహించి తుది జట్టును ఎంపిక చేస్తామన్నారు. రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కోశాధికారి అభిషేక్ గౌడ్, జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నరసయ్య పాల్గొన్నారు.

పాలిసెట్‌లో ఉమ్మడి జిల్లా విద్యార్థుల ప్రతిభ



లక్కీ అక్షయ రాజేశ్వరి శివాని సంజన



ఎం స్వప్న బి స్వప్న

డిచ్‌పల్లి: టీఎస్ పాలిసెట్ ఫలితాల్లో మండలంలోని ధర్మారం(బి) సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు సత్తాచాటినట్లు ప్రిన్సిపాల్ సంగీత ఒక ప్రకటనలో తెలిపారు. పలువురు విద్యార్థులు 20వేల లోపు ర్యాంకులు సాధించారన్నారు. లక్కీ 2599 ర్యాంకు, అక్షయ 2635 ర్యాంకు, రాజేశ్వరి 2006 ర్యాంకు, శివాని 3941 ర్యాంకు, సంజన 5129 ర్యాంకు, స్వప్న 4592 ర్యాంకు, స్వప్న 3569 ర్యాంకు, వైష్ణవి 9984ర్యాంకు, తేజస్వి 11623 ర్యాంకు, మానస 16713 ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ఈసందర్భంగా శుక్రవారం వారిని ప్రిన్సిపల్ సంగీత, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

'మోడల్'కు ఉత్తమ ర్యాంకులు..

సదాశివనగర్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు పాలిసెట్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖర్ ఒక ప్రటనలో తెలిపారు. జోయల్ ఎంపీసీ విభాగంలో 885వ ర్యాంక్, ఎంబైపీసీలో 421 ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. అలాగే సంపత్ ఎంపీసీలో 1197 ర్యాంక్, ఎంబైపీసీలో 666వ ర్యాంక్ సాధించారు. సుప్రీత్‌రెడ్డి ఎంపీసీలో 1296వ ర్యాంక్, ఎంబైపీసీలో 1976 ర్యాంక్ సాధించారు. రాకేశ్ ఎంపీసీలో 1645వ ర్యాంక్, ఎంబైపీసీలో 6152వ ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల అధ్యాపక బృందం అభినందించారు.

జక్రాన్‌పల్లి మండలంలో..



వివేక్ విష్ణు చరణ్‌గౌడ్ అక్షయ

జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు పాలిసెట్‌లో ప్రతిభ కనబరిచారు. వివేక్ 328 ర్యాంకు, విష్ణుచరణ్‌గౌడ్ 383 ర్యాంకు, అక్షయ 408 ర్యాంకు, మరో 17 మంది 1000 నుంచి 43వేల వరకు ర్యాంకులు సాధించారు. వీరిని ప్రిన్సిపల్ రాజేష్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

అకౌంట్ నుంచి రూ.20వేలు మాయం

కామారెడ్డి క్రైం: ఓ వ్యక్తి అకౌంట్ నుంచి రూ. 20 వేలు కాజేసిన ఘటన రామేశ్వర్‌పల్లిలో శుక్రవారం వెలుగుచూసింది. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన అలుగునూరి భూపతికి కామారెడ్డిలోని ఐటీబీ బ్యాంకులో అకౌంట్ ఉంది. జనవరి 2న రూ.2.06 లక్షల చెక్కును అకౌంట్‌లో వేసుకున్నాడు. ఫిబ్రవరి 7న తన ఖాతా నుంచి రూ. 20వేలు మరో గుర్తుతెలియని వ్యక్తి ఖాతాకు బదిలీ అయ్యాయి. రెండు రోజుల క్రితం విషయం తెలుసుకుని కామారెడ్డి పోలీసులను ఆశ్రయించాడు. విచారణ జరిపి శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో నరేష్ తెలిపారు. చెక్కును బ్యాంకులో డిపాజిట్ చేసే సమయంలో గుర్తుతెలియని వ్యక్తి సహాయం తీసుకోవడంతో ఇలా జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

ఆర్మూర్‌లో చైన్‌స్నాచింగ్

ఆర్మూర్‌టౌన్: పెర్కిట్‌లో గురువారం రాత్రి చైన్ స్నాచింగ్ జరిగింది. పెర్కిట్‌లోని తిరుమల కాలనీకి చెందిన మూడ హేమలత అనే మహిళ మెడల్లోంచి మూడున్నర తులాల బంగారు చైన్‌ను గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు బైక్‌పై వెనకాల వచ్చి చోరీ చేశారు. హేమలత, తన కూతరు ఇద్దరు కలిసి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో ఘటన జరిగింది. ఈ విషయమై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అనుమానాస్పదస్థితిలో మృతి!

బాన్సువాడ: పట్టణంలోని బీడీ వర్కర్స్ కాలనీ సమీపంలో శుక్రవారం అనుమానాస్పదస్థితిలో మైన (30) అనే (థర్డ్ జెండర్) హిజ్రా మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. మహబుబ్‌నగర్ జిల్లా రంగారెడ్డి గూడ మండలం హెమ్లా తండాకు చెందిన మైన కొంతకాలంగా బాన్సువాడలో నివాసముంటుంది. మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి, తిరిగి రాలేదు. శుక్రవారం బీడీ వర్కర్స్ కాలనీకి సమీపంలో ఆమె మృతదేహం చెట్టుకు వేలాడి కనిపించడంతో పశువులకాపరులు పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికి మృతు దేహం పూర్తిగా కుళ్లిపోయి దుర్వాసన వస్తుందని కాలనీవాసులు తెలిపారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. విషయం తెలుసుకున్న హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లా నుంచి హిజ్రాలు తరలివచ్చారు. కాకినాడలో ఉన్నప్పుడు ఓ యువకుడితో ఉన్న ప్రేమలో ఉన్నట్లు, ఈ విషయంపై గతంలో గొడవలు కూడా జరిగాయని, మైన మృతికి ప్రేమ వ్యవహారమే కారణమని స్థానికులు అనుమానిస్తున్నారు. ఈవిషయంపై సీఐ మహేందర్‌కు వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని అన్నారు.



మైన (ఫైల్)

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



శ్రీకాంత్ మృతదేహం

నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్ మండలం నాందేడ్-సంగారెడ్డి జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాంత్(27) అనే యువకుడు మృతి చెందినట్లు ఎస్సై నాగగోణి రాజు తెలిపారు. జుక్కల్ మండలానికి చెందిన శ్రీకాంత్ బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తుండగా లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని పాటి హన్మాన్ ఆలయం సమీపంలోగల వ్యవసాయ బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. శుక్రవారం ఉదయం పాటి హన్మాన్ పరిసర ప్రాంతం ఈతవనానికి వెళ్తున్న గీతా కార్మికులకు బావిలో మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్‌ఐ రాజశేఖర్ ఘటన స్థలానికి చేరుకొని స్థానికుల సహాయంతో బావిలో నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి వయస్సు సుమారు 40ఏళ్లు ఉంటాయని, ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. గుర్తు తెలియని మృతదేహం కింద కేసు నమోదు చేశామని తెలిపారు.

కేసుకు భయపడి ఒకరి ఆత్మహత్య

రామాయంపేట(మెదక్): పోలీస్ కేసుకు భయపడి కామారెడ్డి జిల్లాకు చెందిన ఓ వ్యక్తి రామాయంపేట మండలంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ రంజిత్ తెలిపిన వివరాలు ఇలా.. దోమకొండ గ్రామానికి చెందిన తోలపు పరుశరాములు(38) అత్త విజయ ఇటీవల ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ నేపథ్యంలో పరుశరాములుపై కేసు నమోదైంది. దీంతో పరుశరాములు రామాయంపేట మండలం దామరచెరువు గ్రామ శివారులో శుక్రవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ర మ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడి అదృశ్యం



అనూత్‌పాల్

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో ఓ బాలుడు అదృశ్యమయ్యాడు. ములుగు జిల్లా ఏటూరు నాగారానికి చెందిన యేసు ఉపాధి నిమిత్తం గత కొంతకాలంగా కమ్మర్‌పల్లికి వచ్చి బస్టాండ్ ప్రాంతంలో నివాసముంటున్నాడు. భార్యభర్తలిద్దరు మంచాలకు నవారా అల్లుతూ జీవనం సాగిస్తున్నారు. వీరికి అనూత్‌పాల్(14) అనే కొడుకు ఉన్నాడు. బాలుడికి మాటలు రావు, చెవులు వినపడవు. మూడు రోజుల క్రితం తల్లిదండ్రులు పనికి వెళ్లారు. ఈసమయంలో బాలుడు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేడు. దీంతో బాలుడి తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు 6281835751, 9490746104, 8712659868 నంబర్లకు తెలపాలని ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

నగరంలో వివాహిత..

ఖలీల్‌వాడి: నగరంలోని ఆర్యనగర్‌లోని సంజీవ్‌నగర్ కాలనీకి చెందిన బండపల్లి అండాలు(45) అదృశ్యమైనట్లు ఎస్సై సందీప్ శుక్రవారం తెలిపారు. భార్యభర్తల మధ్య గొడవ జరగడంతో ఈనెల 25న రాత్రి ఆమె ఇంటి నుంచి వెళ్లగా, ఇప్పటికీ తిరిగి రాలేదు. చుట్టుపక్కల ఎంతవెతికిన ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో భర్త ప్రభాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అండాలు ప్రభుత్వ టీచర్‌గా పని చేస్తున్నారు.

నగరంలో యువకుడు..

ఖలీల్‌వాడి: నగరంలోని మాలపల్లికి చెందిన షేక్ సుమేర్(23) అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు శుక్రవారం తెలిపారు. ఈనెల 26న ఉదయం ఇంటి నుంచి వెళ్లిన సుమేర్ తిరిగి ఇంటికి రాలేదన్నారు. సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ అయింది. దీంతో అతడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

మతిస్థిమితంలేని యువతిపై వృద్ధుడి అత్యాచారం

- ఆలస్యంగా వెలుగులోకి సంఘటన

ఎల్లారెడ్డి: మతిస్థిమితంలేని 20ఏళ్ల యువతిపై 60ఏళ్ల వృద్ధుడు అత్యాచారం చేసిన ఘటన మండలంలోని కళ్యాణి గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన మతిస్థిమితంలేని యువతికి అదే గ్రామానికి చెందిన వృద్ధుడు 15రోజుల క్రితం కూల్ డ్రింక్‌లో మత్తు మందు కలిపి ఇచ్చి తాగించారన్నారు. అనంతరం యువతిపై అతడు అత్యాచారానికి పాల్పడినట్లు పేర్కొన్నారు. యువతి తీవ్రంగా గాయపడడంతో స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. సదరు యువతిపై మత్తుమందు ఇచ్చి అత్యాచారం చేశారని వైద్యుడు తెలపడంతో వారు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈవిషయమై ఎస్సై గణేష్‌ను వివరణ కోరగా యువతి అత్యాచారానికి సంబంధించి ఫిర్యాదు వచ్చిందని, విచారణ నిర్వహిస్తామని అన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ



తాడ్వాయి: మండలంలోని కృష్ణాజివాడి గ్రామ శివారులో గల ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని దుండగులు చోరీ చేసినట్లు గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. గ్రామ శివారులోగల ట్రాన్స్‌ఫార్మలోగల రాగివైరు, ఆయిల్‌ను చోరీ చేశారని, వాటి విలువ రూ.10వేల వరకు ఉంటుందని తెలిపారు. ఈమేరకు తాడ్వాయి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

నాటు సారా విక్రేతల బైండోవర్



సిరికొండ: నాటు సారా విక్రయిస్తున్న ఇద్దరిని తహసీల్దార్ గఫార్‌మియా ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై నర్సింలు శుక్రవారం తెలిపారు. సర్పల్లితండా జీపీ పరిధిలోని వడ్డెర కాలనీకి చెందిన బోదాసు నర్సయ్య, తాళ్లరామడుగు వడ్డెర కాలనీకి చెందిన పిట్ల రాములు నాటు సారా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు వారిని పట్టుకున్నట్లు తెలిపారు. మరోమారు నాటు సారా విక్రయిస్తే కేసు నమోదు చేసి అరెస్ట్ చేస్తామని ఎస్సై తెలిపారు.

ఆటో చోరీకి యత్నించిన వ్యక్తి అరెస్టు

ఖలీల్‌వాడి: నగరంలోని గౌతమ్‌నగర్‌కు చెందిన షేక్‌షఫీ తన ఇంటి ముందు పార్క్ చేసిన ఆటోను ఓ దుండుగుడు చోరీకి యత్నించగా.. అతడిని పట్టుకొని అరెస్టు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 26న ఉదయం 5గంటలకు కెనాల్ కట్టకు చెందిన దేల్గందే బాలాజీ ఆటోను చోరీకి ప్రయత్నించినట్లు ఎస్సై తెలిపారు. షేక్ షఫీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.